క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



వెంకటాపురం(ఎం) : మండల కేంద్రంలోని తాళ్లపాడులో చైతన్య గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీటీసీ పోశాల అనితవీరమల్లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం అలువాల రవి, సీసీ ఐలయ్య, వీఓలు రామిండ్ల జ్యోతి, శెట్టి మంజుల, సాద రాజప్రమీల, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు రెడ్డి వనమాల, తోట మాధవి, గుర్రాల మౌనిక, బండి శ్యామల, కోమల తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



భారతమ్మ

మంగపేట : మండలంలోని మల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మొట్లగూడెం గ్రామానికి చెందిన గంగాడి భారతమ్మ(50) ఆదివారం నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. పక్కింటి బంధువుతో గొడవ పడిన భారతమ్మ మనస్తాపంతో ఇంటి నుంచి మల్లూరు వైపు వెళ్లి సాయంత్రం వరకు కనిపించలేదు. తెలిసిన వారి వద్దకు వెళ్లి ఉండొచ్చని బంధువుల ఇళ్లల్లో అన్ని చోట్ల వెతికామని, అయినా తమకు ఎలాంటి సమాచారం లేదని సోమవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ఎవరికైనా కనబడితే 81062 46791 నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని కుటుంబీకులు కోరారు.

ఇసుక తరలించకుండా చర్యలు



ఎస్‌ఎస్ తాడ్వాయి : మండలంలోని మేడారం జంపన్నవాగు నుంచి ఇసుక అక్రమంగా తరలించకుండా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ఈనెల 10న అక్రమంగా ఇసుక తరలింపు విషయంపై సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో రెవెన్యూ అధికారులు స్పందించారు. ఈ మేరకు తహసీల్దార్ రవీందర్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ సునీల్ సోమవారం మేడారం జంపన్నవాగును సందర్శించి ఇసుక తరలింపుపై ఆరా తీశారు. ఇసుక తరలిస్తున్న ప్రాంతాలను గుర్తించి, వాగులోకి ట్రాక్టర్లు వెళ్లకుండా పొక్లెయినర్‌తో కందకం తవ్వించారు. అక్రమంగా ఇసుక తరలింపునకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మిర్చి తోటల పరిశీలన

మహదేవపూర్: మండలంలో సాగు చేసిన మిర్చి తోటలను జిల్లా ఉద్యాన శాఖ అధికారి రమేశ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిరప పంటను ఆశిస్తున్న తామర పురుగు వల్ల తెగుళ్లపైన పరిశీలించినట్లు తెలిపారు. మిర్చి తోటల్లో గతేడాది కంటే నల్ల తామర పురుగు ఉధృతి తగ్గిందన్నారు. మిర్చి సాగు చేసే రైతులు దుక్కి నుంచే సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



వెంకటాపురం(కె) : ఆలయం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



మంగపేట: శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

మంగపేట : మండల కేంద్రంలోని ఉమాచంద్రశేఖర స్వామి దేవాలయంలో ఆలయ చైర్మన్ మైల నరేష్‌రెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం శివపార్వతుల కల్యాణాన్ని ఆలయ పూజారి నరేష్‌శర్మ అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కల్యాణానికి తరలివచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో హోమం పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొమరగిరి కేశవరావు, సామ్రాజ్యం దంపతులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

ఉసిరి, తులసి చెట్టుకు కల్యాణం

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని సీతారామచంద్ర స్వామి ఆలయంలో కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా తులసి, ఉసిరి చెట్టుకు కల్యాణ మహోత్సవాన్ని అర్చకులు యల్లాప్రగడ నాగేశ్వర్‌రావుశర్మ నిర్వహించారు. ఉసిరి చెట్టు(జనార్దన విష్ణుమూర్తిగా), తులసి చెట్టు(లక్ష్మీదేవి)గా కొలచి వివాహ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మోడెం రమేశ్, డైరెక్టర్ బ్రహ్మం, అశోక్‌గౌడ్, ఇర్సవడ్ల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కార్తీక జ్యోతిర్ మహోత్సవం

వెంకటాపురం(కె) : మండల కేంద్రంలోని మంగపేట గోదావరి రేవుకు వెళ్లే దారిలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సోమవారం కార్తీక జ్యోతిర్ మహోత్సవ కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్తీక మాసం చివరి సోమవారం కావడంతో ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా సాయంత్రం వేళ స్వామి వారికి ప్రత్యేక పూజతో పాటు సింధూరం, నాగబెల్లి నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద 10,302 వొత్తులు వెలిగించారు. కార్తీక జ్యోతిర్ మహోత్సవం సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసింది.

పాలెం ప్రాజెక్టు వద్ద వనభోజనాలు

మండల పరిధిలోని పాలెం ప్రాజెక్టు సమీపంలో సోమవారం మున్నూరు కాపు సంఘం సభ్యులు వనభోజన కార్యక్రమం నిర్వహించారు. మహిళలు ఉరిసి చెట్టుకు పూజ చేశారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు ఆట పాటలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం భద్రాచలం నియోజక వర్గ ఇన్‌చార్జ్ ధనపనేని వెంకటేశ్వర్లు, నాగరాజు, బెజ్జని సత్తిబాబు ఉన్నారు.



మంగపేట: శివపార్వతుల కల్యాణంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ నరేష్ రెడ్డి దంపతులు



ఏటూరునాగారం: ఉసిరి, తులసి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు



కల్యాణ తంతులో పాల్గొన్న భక్తులు

సీతక్కను కలిసిన మండల నాయకులు



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఏటూరునాగారం : రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన ధనసరి అనసూయ(సీతక్క)ను హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, ప్రధాన కార్యదర్శి వావిలాల ఎల్లయ్యతో కలిసి సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ముక్కెర లాలయ్య, బ్లాక్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింహారావు, మండల ఉపాధ్యక్షుడు వీసం నర్సయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ డోంగిరి మధుబాబు, తాళ్లపల్లి నరేందర్, ఇర్సవడ్ల కిరణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వాలని ఏఎన్‌ఎంల ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు, ఏఎన్‌ఎంలు

ఏటూరునాగారం : ఐదు నెలలుగా తమకు వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే చెల్లించాలని ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఏఎన్‌ఎంలు సోమవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తుడుందెబ్బ జాతీయ రాష్ట్ర నాయకుడు పొడెం రత్నం, పొడెం బాబు తదితరులు ధర్నాలో పాల్గొని మద్దతు తెలిపారు. ఈసందర్భంగా ఏఎన్‌ఎం నాయకురాలు టి.నాగలక్ష్మి మాట్లాడుతూ.. ఐదు నెలల నుంచి తమకు వేతనాలు రావడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమకు వెంటనే వేతనాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 40 మంది ఏఎన్‌ఎంలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాహన పత్రాలు తప్పనిసరి



కారును తనిఖీ చేస్తున్న ఎస్సై ఎండి.షఖాన్

చిట్యాల: ప్రతి వాహనదారుడు వాహన పత్రాలు తప్పనిసరిగా వెంట తీసుకు పోవాలని ఎస్సై ఎండి.షఖాన్ తెలిపారు. సోమవారం మండలంలోని చల్లగరిగ శివారులో వాహనాల తనిఖీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనాదారులు వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడపొద్దన్నారు. ఒకవేళ మద్యం తాగిన, అనుమతి పత్రాలు లేకపోయినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

హామీలను అమలు చేయాలి



సమావేశంలో పాల్గొన్న ఐక్యవేదిక నాయకులు

భూపాలపల్లి రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని విప్లవ పార్టీల ఐక్యవేదిక నాయకులు కోరారు. జాడి గట్టయ్య అధ్యక్షతన సోమవారం సీపీయూఎస్‌ఐ కార్యాలయంలో విప్లవ పార్టీల ఐక్యవేదిక నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ మాట్లాడారు. నూతనంగా ప్రజల చేత ఎన్నుకోబడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినటు వంటి ఆరు గ్యారంటీ పథకాలను 100 రోజుల్లో అమలు చేస్తానని ముఖ్యమంత్రి చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రానున్న సింగరేణి ఎన్నికల్లో విప్లవ పార్టీల సంఘాల నాయకులను గెలిపించుకోవాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. జిల్లాలో ఉన్నటువంటి నిరుపేదలు, నిరుద్యోగులు, కార్మికులు, సంఘటిత, అసంఘటిత కార్మికులు, రైతాంగం, వ్యవసాయ కూలీలు, కౌలు రైతుల సమస్యల కోసం, ప్రజల పక్షాన హక్కుల సాధనకు నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రెటరీ చంద్రగిరి శంకర్, సీపీయూఎస్‌ఐ జిల్లా కార్యదర్శి వావిలాల లక్ష్మణ్‌తో పాటు తదితర నాయకులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ పోటీ



సమావేశంలో మాట్లాడుతున్న భూక్యా జంపన్న

ములుగు రూరల్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో ములుగు జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో బీఎస్పీ అభ్యర్థులు పోటీ చేస్తారని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూక్యా జంపన్న అన్నారు. ఈ మేరకు సోమవారం ములుగులోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు శనిగరపు నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయినందుకు కార్యకర్తలు, నాయకులు, ప్రజలు కుంగిపోవద్దని స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలన్నారు. ఎన్నికల్లో 30శాతం యువతకు ప్రాధాన్యం కల్పిస్తామని అన్నారు. డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆశయాలకు అనుగుణంగా యువత రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వీరబోయిన రాజేందర్, పసులాది ముకేష్, తిరుమల, భిక్షపతి, వీరస్వామి, రాజుకుమార్, భాగ్యలక్ష్మి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత



ములుగు రూరల్ : ములుగు జిల్లా కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన ఐత రాజయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని గంద్రకోట సుధీర్ సేవా ఫౌండేషన్ సభ్యులు పరామర్శించారు. ఈ మేరకు సోమవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు అందించి, అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో సభ్యులు కందికొండ కుమార్, చింత రాజు, రంజిత్, అంజి, సంపత్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

టేకుమట్ల: మండలంలోని బూర్నపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రేనుకుంట్ల సమ్మయ్య తల్లి రాజమ్మ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను సోమవారం హనుమకొండ లావణ్య హాస్పిటల్ అధినేత డాక్టర్ నవీన్ పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు సంతోష్, మొండయ్య, పెద్ద సమ్మయ్య, రాము, రాకేష్, నేరేళ్ల రామకృష్ణగౌడ్, రవి, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు బియ్యం పంపిణీ



బియ్యం పంపిణీ చేస్తున్న ఫిలిప్‌రాజు

మొగుళ్లపల్లి: మండలంలోని మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు 'రైస్ లవ్ స్వచ్ఛంద సంస్థ'ఆధ్వర్యంలో సోమవారం బియ్యం పంపిణీ చేశారు. 100మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ 20కిలోల సన్న బియ్యంను డీఈఓ రాంకుమార్ చేతుల మీదుగా పేద విద్యార్థుల తల్లిదండ్రులకు చేయూతనివ్వడానికి స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పుల్లూరి ఫిలిప్‌రాజు ఆధ్వర్యంలో అందించినట్లు ప్రధానోపాధ్యాయుడు కుమారస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి రాంకుమార్ బియ్యం పంపిణీ చేసిన సంస్థ డైరెక్టర్ ఫిలిప్‌రాజును, ఇందుకు సహకరించిన ఉపాధ్యాయురాలు గ్లోరిరాణిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరహరి పద్మ, ఎస్‌ఎంసీ చైర్మన్ ఆళ్ల గోపాల్రెడ్డి, ఏఎస్సై వెంకటరత్నం, రాజయ్య, ఉపాధ్యాయులు నరసింహస్వామి, సంపత్ కుమార్, సదానందం, వీరయ్య, ఉమారాణి, మధుసూదన్, శ్రీధర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కల్లాల్లో తడుస్తున్న ధాన్యం

- కొనుగోలు కేంద్రాలు లేక ఇబ్బంది పడుతున్న రైతులు
- పట్టించుకోని ప్రభుత్వ అధికారులు



తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతులు, మొలకెత్తిన ధాన్యం (ఇన్‌సెట్‌లో)

ఏటూరునాగారం : ఇటీవల కురిసిన అకాల వర్షాలకు కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి మొలకెత్తింది. పంటలు కోతకు రావడంతో రైతులు ధాన్యాన్ని కోసి కల్లాల్లో ఆరబోసుకున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఆరబోసిన ధాన్యం రాశుల వద్ద రాత్రి, పగలు కాపలా కాస్తున్నారు. కాగా ఇటీవల వచ్చిన మిచాంగ్ తుపాన్ ప్రభావంతో ఆరబోసిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. అప్పటినుంచి ధాన్యాన్ని తిరగేస్తూనే ఉన్నారు. ధాన్యం నిమ్ముగా ఉండడంతో మొలకలు వస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి చేతికొచ్చిన పంట మొలకలు రావడంతో రైతుల కళ్లల్లో కన్నీళ్లు తిరుగుతున్నాయి. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

కొనుగోలు కేంద్రాలను సకాలంలో ఏర్పాటు చేయకపోవడంతో రైతులు కల్లాల వద్ద ధాన్యం ఆరబోయగా ఇటీవల కురిసిన వర్షానికి తడిసి మొలకెత్తిందని రైతులు మాదరి రాంబాబు, బండమీది యాదగిరి, ముద్రబోయిన దయాకర్, ముద్రబోయిన సంపత్, సారంపెల్లి జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని షాపెల్లి గ్రామంలో కొనుగోలు కేంద్రాలు లేక కల్లాల వద్ద మొలకెత్తిన ధాన్యాన్ని వారు ఆరబోసుకున్నారు. కల్లాలను ఏర్పాటు చేసే క్రమంలో రైతుల వద్ద సరైన పరదాలు, టార్పాలిన్ కవర్లు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు సబ్సిడీపై గతంలో ఇచ్చేవారని ఇప్పుడు వాటిని రద్దు చేశారన్నారు. రైతుల ధాన్యం తడవడం వల్ల తీవ్ర ఆర్థిక నష్టం జరుగుతుందన్నారు. గతంలో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసేవారని, ఈసారి అవి లేకపోవడంతో నిల్వ చేసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

సన్నాలకు పెరిగిన డిమాండ్

- ధాన్యాన్ని నేరుగా మిల్లర్లకు, ప్రైవేట్ వ్యక్తులకు విక్రయాలు
- కొనుగోలు కేంద్రాలకు మొగ్గు చూపని రైతులు



ధాన్యం కాంటా పెడుతున్న హమాలీలు

మల్హర్: సన్నరకం ధాన్యానికి డిమాండ్ భారీగా పెరిగింది. వానాకాలం సీజన్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా రైతులు పండించిన సన్నాలకు మార్కెట్‌లో డిమాండ్ పెరగడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర కంటే ఎక్కువకు అమ్ముకునే అవకాశం రావడంతో పంటలను నేరుగా రైసు మిల్లర్లు, ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించడాని ఆసక్తి చూపుతున్నారు. రైతులు పంట కోసిందే ఆలస్యం మిల్లర్లు, వ్యాపారులు పొలంలోకే వెళ్లి ధాన్యాన్ని కొంటున్నారు. 17 శాతంలోపు తేమ ఉంటే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే క్వింటా ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,203, కామన్ ధాన్యానికి రూ.2,183 ప్రభుత్వం చెల్లిస్తుంది. కానీ తేమతో సంబంధం లేకుండా మిల్లర్లు, ప్రైవేట్ వ్యక్తులు రూ.2,100 నుంచి రూ.2,300 వరకు చెల్లిస్తున్నారు.

15వేల ఎకరాల్లో సాగు..

మండల వ్యాప్తంగా 15వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. జిల్లా రైస్ మిల్లు అసోసియేషన్ సూచనల మేరకు 1001, 1121, 1153, 1156, 3291 రకాలు రైతులు సాగు చేయకుండా ఎంటీయూ 1061, 1064, 1224, 1262, 1271, 1318, 7029, 24423, ఆర్‌ఎస్‌ఆర్, హెచ్‌ఎంటీ, సోనా, బీపీటీ 5204 వంటి సన్న రకాలు సాగు చేశారు. 1001 సైతం కొంత మంది రైతులు సాగు చేశారు.

సమయం ఆదా



నాకున్న 5 ఎకరాల్లో వరి సాగు చేశాను. 100 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. తేమ శాతం సంబంధం లేకుండా మద్దతు ధర కంటే అధికంగా చెల్లించడానికి వ్యాపారులు ముందుకు వస్తున్నారు. కల్లాల్లో ఆరబోసిన ధాన్యానికి పరదాల ఖర్చు, హమాలీ చార్జీ ఉంటుంది. నేరుగా వ్యాపారులు కొనుగోలు చేయడంతో ఇలాంటి ఇబ్బందులు ఉండవు. రెండు మూడు రోజుల్లో డబ్బులు కూడా ఇస్తామని చెబుతున్నారు. కల్లాల్లో ధాన్యాం ఆరబోయకుండా ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నా. దీంతో సమయం కూడా వృథా కాకుండా ఉంటుంది.

– ప్రవీణ్‌రెడ్డి, యువ రైతు, కుంభంపల్లి, మల్హర్

కొనుగోలు కేంద్రాలకు తగ్గిన ధాన్యం

రైతులు పండించిన సన్నరకం ధాన్యం అమ్ముకోవడానికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు ఆసక్తి చూపించడం లేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం 17 కంటే ఎక్కువగా ఉండటానికి వీలు లేదు. ఒక వేళ తేమ ఎక్కువగా ఉంటే మిల్లర్లు తిరస్కరిస్తారు. ఇప్పుడు మాత్రం.. రైస్ మిల్లర్లు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. తేమ 24–25 శాతం ఉన్నా మార్కెట్ ధర కంటే ఎక్కువ ధరకు కొనడానికి మిల్లర్లు ముందుకు వస్తున్నారు. హార్వెస్టర్లతో వరి కోతలు కోయడం, వెంటనే ధాన్యాన్ని బస్తాల్లో నింపడంతో ధాన్యం ఎండే పరిస్థితి లేదు. అయినా మిల్లర్లు కొర్రీలు పెట్టకుండా ధాన్యం నేరుగా కొనుగోలు చేస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కేంద్రాల్లో తరలించకుండా నేరుగా మిల్లులకు, వ్యాపారులకు విక్రయించడంతో కేంద్రాల్లో ధాన్యం నిల్వలు తగ్గుతున్నాయి. కేంద్రాల్లో వెయింటింగ్, పరదాల ఖర్చు, హమాలీ చార్జీలు లేకుండా మద్దతు ధర కంటే ఎక్కువగా, రెండు, మూడు రోజుల్లో డబ్బులు చేతికి వస్తుండటంతో రైతులు మిల్లుకు, ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు.

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం



మల్హర్: ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో గుడిసె దగ్ధమైన సంఘటన మండలంలో వల్లెకుంటలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ అర్జయ్య తన కుమారుడు అనారోగ్యంతో బాధపడుతుండగా కరీంనగర్ ఆస్పత్రికి వెళ్లారు. ఇంట్లో ఉన్న కుమార్తె దేవుడికి దీపం పెట్టి పూజ చేసింది. ఈ క్రమంలో ఒక్కసారిగా దీపం మంటలు చెలరేగి గుడిసెకు నిప్పు అంటుకుంది. చుట్టూ పక్కల వారు గమనించి మంటలు ఆర్పారు. అప్పటికే ఇంట్లో ఉన్న సామగ్రి, ఎలక్ట్రానిక్ వస్తువులు, నగదుతో పాటు గుడిసె సగం కాలిపోయింది. నిరుపేద కుటుంబానికి చెందిన తనను ప్రభుత్వం ఆదుకోవాలని అర్జయ్య వేడుకున్నాడు.